



రచన : వంకాయల సత్యవతిదేవి

రిక్షాదిగి తలుపు తాళంతీసుకొని లోపలికి ప్రవేశించిన ప్రమీల ఆ గదిని చూసి ఒక్కమాటు భయపడింది. అదంతా ఒక రణరంగంలా భీభత్సంగా వుంది. క్రింద కాలు మోపితే అరంగుళం దళసరిని ధూళి, మీదకు తలెత్తితే బూజులు, సాలెగూళ్ళు. ఇంక పుస్తకాలు, మాసిపోయినబట్టలు, రేజరు మొదలయిన సామానులు గదంతట విరజిమ్మి వున్నాయి. ఇదంతాచూసినప్రమీలకు మొదట భయం, తరువాత కోపం క్రమేపి జాలి కలిగేయి. 'ఈ మగవాళ్లబేరాలు పలకడానికే తప్పించి మరెందుకు పనికిరారు' అనుకుని బట్టలైన మార్చుకోకుండా గదిని సర్దడానికి పూనుకుంది.

మొదట పుస్తకాలు, బట్టలు అన్నీ ఒక మూలపెట్టి ధూళి, బూజులు అన్నీ దులిపి బాగుచేసి ఏ వస్తువు నాస్థానంలో పెట్టడానికి మొదలుపెట్టింది. పుస్తకాలు ఒక్కొక్కటే తీసి పైనున్న దుమ్ముదులిపి ఒక వరసలో పెడుతున్నది. ఇంతలో ఆమెదృష్టి పుస్తకంలోంచి పడ్డ ఒక కవరుమీదపడింది. అది తన భర్తకొచ్చిన వుత్తరం. చేతిలోవున్న పుస్తకం అవతలపెట్టి కవరు చేతిలోకి తీసుకుంది. అందులోంచి ఒక ఫోటో ఒక ఉత్తరం బయటకుతీసింది. ఫోటోపై దృష్టిపడగానే ప్రమీల ముఖభంగిమలు మారిపోయాయి. ఆఫోటోలో వున్నది తనభర్తే. అయితే ప్రక్కనున్న స్త్రీ యెవరు. తను చూస్తున్నది కలా! నిజమా! వికలమైన హృదయంతో ఫోటోవైపు మరొక మారు చూసింది. 'అతను మాటవరసకేనా ఈమె సంగతి యెప్పుడు నాతో చెప్పలేదే. వణుకుతున్న చేతులతో ఉత్తరాన్నితీసి పట్టుకుంది. అందులోని అక్షరాలు మసకమసగ్గా కనిపిస్తున్నాయి ఆమె కళ్లకి.

ప్రియమైన రామూ !

నీ ఉత్తరం అందింది. నీ కోరిక ప్రకారం మనిద్దరంకలసి తీయించుకున్న ఫోటో పంపుతున్నాను. అదిమాత్రం మీ శ్రీమతికంట బడనియ్యకు. రహస్యంగా యేమూలనైన వుంచు. నీ జవాబుకోసం యెదురుచూస్తున్నాను.

ఇట్లు,
నీ ' సుధ '

ప్రమీల మనస్సులో ఒక్కమాటు క్రోధం, ఉడుకుమోత్తనం ఉరకలువేసింది. ఛీ! పురుషుణ్ణి ఎంతనమ్మి సర్వస్వం అప్పజెప్పినప్పటికి యేదో మోసంచేస్తునేవుంటాడు. వాళ్లకి నీతి, నియమం అంటూ లేదు. అందుకే ఎటువంటి పరిస్థితుల్లోని మగవాణ్ణయినా నమ్మకూడదనుకుంది. ఒకమూలనుంచి వస్తున్న దుఃఖాన్ని ఆపుకుంటూ యెక్కడిపనులక్కడే వదిలిపెట్టి మంచంపై చేరింది ప్రమీల.

గడియారం అయిదు గంటలు కొట్టింది. రామారావు రాస్తున్న కాగితాలని ఒకమూలకు నెట్టి కుర్చీలోంచిలేచాడు. "ఏంరోయ్ ఈరోజు యింత పెందరాడే లేచావు యేదేనా ప్రోగ్రాముందా?" అని యెదురుగుండా వచ్చేడు తోటి గుమస్తా లక్ష్మీపతి. అబ్బ యింక బాతాఖానీకి తగులుకుంటే వదలడు. అంచేతకారణంచెప్పి వేగిరం బయలుదేరాలి అనుకుంటూ "ఏ ప్రోగ్రామూ లేదోయ్. ఈరోజు మా శ్రీమతి పుట్టింటినుంచి వస్తుంది. ఆఫీసరు ధర్మమా అంటూ స్టేషనుకి వెళ్లడం అయిందికాదు. పోనీ యింటికేనా వేగిరంవెళ్లి కావలసిన వస్తువులు అవి చూద్దామని బయలుదేరాను" అని సమాధానమిస్తూ యింక అక్కడే నించుంటే యింకెన్ని ప్రశ్నలు వేస్తాడో అని గబగబా ముందరకి నడిచేడు రామారావు.

బజారువెంట నడుస్తున్న రామారావుకి ఆలోచనలు ఒకదాని వెంట నొకటి రాసాగిన్నై. మూడు నెలలబట్టి పుట్టింటికి వెంచేసిన శ్రీమతి యీరోజున వస్తుంటే స్టేషను కెళ్లడానికేనా ఆఫీసరు సమ్మతించేడుకాదు. ఇదే అతని భార్య పిల్లలు వస్తుంటే అలాగే వూరుకుంటాడా? ఆఫీసరనగానే అలాంటి అహంకారం వస్తుంది కాబోలు. ఎంత కర్కోటకుడు. ఆఫీసరును గురించి వస్తున్న ఆలోచనలకు నవ్వువచ్చింది రామారావుకు. అడుగులు త్వరగా పడుతున్నాయి. అప్పుడే ప్రమీలనుచూసి 3 నెలలయింది. వేగిరం తమ్మని యెన్ని ఉత్తరాలు వ్రాసినా రాకపోవడానికి కారణం యేమిటో వెళ్లగానే అడగాలి. అయినా భర్త భార్యని యెంత నెత్తిపైపెట్టుకొని పూజిస్తున్నాసరే పుట్టిల్లనగానే స్త్రీకి మరి వీళ్లెవరు కనిపించరు. సంపెంగపువ్వులు, పాతికబేడ కావాలా బాబు అన్న పిలుపువిని ఆలోచనలకి సడన్‌బ్రేకువేసి వెనక్కితిరిగేడు రామారావు. పువ్వులు బాగున్నాయి, నిగనిగలాడుతున్నాయి. ప్రమీలకు సంపెంగపువ్వులంటే చాల యిష్టం. యీ సంగతి జ్ఞాపకంరాగానే ఒక పాతిక పువ్వులియ్యి అని బేడకాసు వాడిచేతిలో పెట్టేడు. పొట్లం అందుకొని ఆలోచనలకి స్వస్తిచెప్పి యింటివైపు తొందరగా నడకసాగించేడు.

దగ్గిరగావేసున్న తలుపునుత్రోసుకొని లోపలికి ప్రవేశించాడు రామారావు. అప్పడే చీకటి పడింది. గదిలో లైటు యెంచేత వేయలేదు చెప్మా అనుకుంటూ గోడకున్న స్విచ్చిని తడుముకుంటూ వేసేసరికళ్లా గదంతా

కాంతితో నిండిపోయింది. ప్రమీల యెక్కడ కనిపించదేం అనుకుంటూ నాలుగు వైపుల దృష్టిని సారించేడు రామారావు. పందిరమంచంమీద యెవరో దుప్పటికప్పుకొని పడుక్కొన్న దృశ్యం కంటపడింది. రామారావుకు ఆశ్చర్యంవేసింది. అదేమిటి ప్రమీల యిలా దుప్పటి కప్పుకొని పడుక్కుంటుందా ? మరి కాకపోతే యింకెవరు. తడబడుతున్న అడుగులతో పందిరిమంచందగ్గరకు వచ్చి మెల్లిగా దుప్పటితొలగించేడు. సందేహంతీరిపోయింది. ప్రమీలే—ఎందుకలా పడుక్కుంది. వంట్లో బాగులేదా? రామారావు ముఖందగ్గిర ముఖం పెట్టి చూచేడు. రేగిన ముంగురుల్, కాటుక కళ్లవెంట ముత్యాలబొట్లలా కన్నీరు, చెక్కిళ్లపై తడియారని కన్నీటిచారలు, అసలే వేసవి కాలం, అందులోను దుప్పటి కప్పుకోవడంచేత కాబోలు వళ్లంతా చెమటతో తడిసిపోయింది. రామారావుకి పరిస్థితంతా అయోమయంగా తోచింది. "ప్రమీలా! ప్రమీలా!" మెల్లిగా పిలచాడు. సమాధానం రాలేదు. ఎంత ఉత్సాహంతో యింటికొచ్చాడో ఆ ఉత్సాహమంతా ఒక్కసారి నీరు కారిపోయింది.

ప్రమీలా! గట్టిగా తట్టిలేపాడు. ఆమె నిద్రపోయివుంటేకదా? ఒకసారి తన విశాలమైన కళ్లనుతెరచి భర్తముఖంలోకి చూచింది. నిదానంగా ఆమెముఖంలోకి చూసిన రామారావుకి గుండె ఒక్కసారి బేజారయింది.

"ఏమిటిది? ఏమిటయింది ప్రమీలా! వంట్లో బాగులేదా ? నాతో చెప్పవూ?" అని లాలనగా అన్నాడు రామారావు. ప్రమీలకు కోపం మరింత యెక్కువయింది. విసురుగా రెండో వైపుకి తిరిగి పడుక్కుంది. "స్టేషనుకి రాలేదని కోపమా? ఏం చెయ్యడం ఆఫీసరు పెర్మిషను యివ్వలేదు" అని సంజాయిషీ చెప్తున్నాడు. అబ్బే అప్పటికీ సమాధానంరాలేదు. కారణం తెలీని రామారావుకి కలవరపాటుతో కాస్తంత చికాకుకూడా కలిగింది. "ఎందుకు అనవసరంగా నువ్వు బాధపడతావు నన్ను బాధపెడతావు. కారణంచెపితే తప్పు తెలుసుకుందికి వీలుంటుంది కదూ?" భర్త అన్న యీ మాటలకు యింతసేపు దిగమ్రింగుకుంటున్న ప్రమీలకోపం ఒక్కసారి తారకస్థాయి నందుకుంది. "మిమ్మల్ని నేనేం బాధపెట్టడంలేదు. అసలు నే నిక్కడికి రావడమే మీకు కష్టంగా వుంది కాబోలు. నేను రేపు మా వాళ్లింటికి వెళ్లిపోతాను. అప్పుడు మీరు హాయిగా వుండండి. అంత నే నంటే యిష్టం లేనప్పుడు నన్నెందుకు పెళ్లిచేసుకున్నారు? మీ యిష్టమొచ్చినవాళ్లనే చేసుకోలేకపోయారూ?"

"ఆగు ప్రమీలా! నీ మాటలకు నా కర్థం తెలీటం లేదు. అంత డొంకతిరుగుడుగా చెప్పకపోతే సూటిగా చెప్పకూడదూ అసలు విషయ మేమిటో?"

"అవునులెండి నా మాటలకర్థం మీకు బోధపడదు. ఇది చూడండి తెలుస్తుంది" అంటూ ప్రమీల ఫోటో, ఉత్తరం రామారావుపై విసిరింది. ఫోటో చూసిన రామారావుకి విషయం అర్థమయింది. ఈ గలభాకి విచారించాలో సంతోషించాలో తెలీలేదు. "ఓస్ ప్రమీలా! యిందుకేనా యింత హంగామా చేసావు. ఈ ఫోటోలోవున్న వాళ్లెవరో నీకు నిజంగాతెలీదూ?" విషయం బోధపరచడానికి ప్రయత్నించేడు. అర్థంతెరిగిన కధగురించి ఆలోచిస్తూ రామారావువైపు చూచింది ప్రమీల. మన పెళ్ళిలో నీకు నాకు రాధాకృష్ణుల వెండివిగ్రహాలను బహూకరించిన నాస్నేహితుడు సుధాకరని అప్పుడే మరచిపోయావా?" వ్యంగ్యంగా ప్రశ్నించేడు. విషయమర్థమవుతున్న ప్రమీలకు ఫోటోలో అమ్మాయికి సుధాకర్‌కిగల పోలికలనుగూర్చి ఆలోచనవచ్చింది. "అయితే యీ ఆడవేషం యేమిటి?" "అలా అడుగు చెపుతాను మేం కాలేజీలో బి.ఏ., ఫైనలియర్ చదువుతున్నప్పుడు ఒక డ్రామావేసాం. అందులో సుధాకర్ హీరోయిన్, నేను హీరో. అప్పుడే ఆవేషాలతోటి ఫోటో తీయించుకున్నాం. నాదగ్గరనున్న కాపీ పోవడంచేత పంపించమని వ్రాసేను. నీ గుణం తెలిసే సుధాకర్ యీ ఫోటో నీకు చూపొద్దని వ్రాసేడు" అని రామారావు ఇంకా యేదో చెప్పబోతూవుంటే "చాల్లెండి మరి మీరేం చెప్పక్కరలేదు. ఈమాట మా సుధాకర్ అన్నయ్యనే అడుగుతాను యీ సుధ యెవరని" చిరునవ్వు లొలకపోసింది ప్రమీల, వేళావిశేషం బాగుందనుకొంటూ చేతులోని పువ్వులపొట్లం శ్రీమతి కందిచ్చేడు రామారావు.

★

# అల్లుడు తెలివి

రచన: ధనేష్

*

ఒక ఊరినుండి మరియొక ఊరికి పెండ్లివారు తరలివచ్చిరి. ఆ పెండ్లికొడుకు అమాయక బుద్ధిమంతుడగుటచే అత్తవారి తెలివి కనుగొనవలెనని ఆలోచించి విడిదెలో అటకమీదనెక్కి కూర్చుండెను. సుమూహూర్తసమయము సమీపించుటచే మంగళ స్నానములు చేయించుటకు అత్తవారు, తనవారు, వచ్చిన చుట్టములు, చుట్టుపట్లవారు, నౌకర్లు, పెండ్లికొడుకును తెగవెతికినను కనబడకపోవుటచే ప్రాణము విసిగి మామగారి పిల్లను తన ఇంటనున్న మేనల్లునికిచ్చి పెండ్లి చేసెను. పిమ్మట పెండ్లి కొడుకు అటకమీదనుండి "కో" యని కేకవేసి నన్నెవరు కనుగొనలేకపోయినారు. మీ ప్రజ్ఞ ఇంతేనా యని యడిగి దిగివచ్చెను. "అల్లుడు తెలివికి అందరు తమలో తాము నవ్వుకొనిరి.

★


## కాలు ఆణి మందు

కాళ్లలో యేర్పడు ఆణికి యీ దివ్యమైన ఔషధమును ప్రతిరోజు పైన చరుముకొని వచ్చినచో ఆణియొక్క మొలకను బయటికి తీసివైచి స్వస్థపరచును. మరల యెప్పటికిని కాలిలో ఆణి రానేరదు. బాగుగ మామూలు ప్రకారము పాదములు అణచి నడచుటకు వీలుపడును.

బుడ్డి 1-కి రూ. 1=00

ధనలక్ష్మి అండ్ కో.,

తపాల్ పెట్టె నెం. 1376, మదరాసు-1.